01ATP04_01ATP04.qxd 04-02-2025 PM 10:39 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 05 ఫిబ్రవరి 2025 పేజీలు : 04



# హంద్రీనీవా కాలువ వెడల్పు చెయ్యాల్సిందే..!!

- హంద్రీనీవా కాల్వ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచాలి
- ఎన్నికల వాగ్దానాన్ని కూటమి అమలు చేయాల్సిందే
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్



ధర్నా నుద్దేశించి మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



హంద్రీనీవా డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఐ, సిపిఎం నేతలు

**అనంతపురం ఫిబ్రవరి 04 ప్రభాతవార్త బ్యూరో**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాయలసీమ ప్రజల మద్దతు కూడగట్టడానికి హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని తెరమీదకు తెచ్చి హాంద్రీనీవా కాలువను పదివేల క్యూసెక్కుల సామర్థ్యము చేపట్టి చివరి ఆయకట్టుకు నీళ్లు అందిస్తామని నమ్మబలికిన పెద్దలు అధికారం రాగానే మాట మార్చడం భావ్యం కాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. మంగళవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని హాంద్రీనీవా సుజల స్రవంతి జిల్లా కార్యాలయం ముందు సిపిఐ ఆద్వర్యంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలను, రైతు సంఘాల నాయకులను కలుపుకొని ధర్నా చేపట్టిన కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడుతూ కర్నూలు జిల్లా మల్యాల నుండి చిత్తూరు జిల్లా కుప్పం వరకు కృష్ణా జలాలను మళ్లించడానికి హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వాలు రైతుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలువ సామర్థం పెంచి చివరి ఆయకట్టుకు నీళ్లు ఇస్తామని ఎన్నికల వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు ఇప్పుడు మాట మారుస్తున్నారన్నారుని ఆరోపించారు. పదివేల క్యూసెక్కుల సామర్థంతో కాలువ వెడల్పు చేసి 6లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడంతో పాటు 30లక్షల మందికి త్రాగు నీరు అందించాలనేది ప్రధాన డిమాండు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని 50 సంవత్సరాలుగా పోరాటం జరుగుతుంది గుర్తు చేశారు. ప్రభుత్వం రైతులకు అనుగుణంగా క్రిష్ణా జనులను తోడి అందించాల్సింది పోయి కాంక్రీటు లైనింగ్ చేపట్టి రైతులను నష్టాలకు గురి చేస్తే ఉద్యమిస్తామన్నారు. మొదటి పేజ్ కింద 14 టీఎంసీల నీటి వాడుకోవాల్సి ఉండగా కాలువ సామర్థం లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రెండోదశ కింద లైనింగ్ పనులు చేపట్టి కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్లడానికి చంద్రబాబు చేసిన కుయుక్తులను బయటపెట్టారు. గోదావరి నీళ్లు బనకచర్ల వరకు కాలువ తవ్వి నీళ్లు ఇస్తామంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా కాలువ విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నాడని ప్రశ్నించారు. రాయలసీమలోని చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లా రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందించే ప్రాజెక్టులపై శీతకన్ను ఎందుకన్నారు. మదనపల్లిలో ఇప్పటికే రైతులు ఆందోళన మొదలుపెడితే అనంతపురం కర్నూలు జిల్లాల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. 30 సంవత్సరాలుగా కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లింపు నినాదం కొనసాగుతూనే ఉందని 1995లో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన విషయం గుర్తు చేశారు. ముఖ్యమంత్రులు మారిన రాయలసీమ రైతాంగ సమస్యలు మాత్రం అక్కడే ఉన్నాయన్నారు. మూతి ముందా తోక ముందా అనే చందంగా చంద్రబాబు వ్యవహారం ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ రెండో దశ లైనింగ్ పనులు వెంటనే ఆపివేయాలని కాలువ సామర్థం పెంచి చెరువులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కాలువ సామర్థం నానాటికి తీశికట్టు చందంగా మారిందని అన్నారు. అనంతపురం జిల్లాలో శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి చెరువులు నీళ్ల లేక వెలవెలబోతున్నాయని హంద్రీనీవా ద్వారా నీటిని మళ్లింపే శరణ్యమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతు సంఘాలు ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మల్యాల నుండి జీడిపల్లి వరకు హంద్రీనీవా కాలువకు సమాంతరంగా మరొక కాలువ తవ్వి రైతాంగాన్ని ఆదుకోవాలని లేనిపక్షంలో రాయలసీమ రైతాంగానికి ఉరితాళ్లు బిగించినట్లే

మిగతా 4లో...

# సూర్యనారాయణస్వామి ఆలయంలో వైభవంగా రథసప్తమి వేడుకలు

- నేత్రపర్వంగా ఛాయా సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవం - వివిధ రాష్ట్రాల నుండి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు అన్నదానం



ప్రత్యేక పూజలందుకున్న సూర్యనారాయణస్వామి



స్వామివారి దర్శనార్థం బారులు తీరిన భక్తులు

**ఉరవకొండ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

చోళరాజుల కాలం 13వ శతాబ్ధంలో నిర్మించబడిన రాష్ట్రంలోనే రెండవదిగా, భారతదేశంలోనే 8వ దేవాలయంగా, ప్రపంచంలోనే దక్షిణాభిముఖముగా ఉన్న ఏకైక సూర్యదేవాలయంగా చరిత్రకెక్కిన ఉరవకొండ మండలంలోని బూదగవి గ్రామంలో వెలసిన సూర్యనారాయణస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోదినామ సంవత్సరం మాఘ శుద్ధ రథసప్తమి పర్వదిన వేడుకలు మంగళవార ం దేవాదాయశాఖ సమూహ ఆలయాల కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, ఆలయ కమిటీ ఛైర్మెన్ సి.చిరంజీవి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు షోఢశోపచార పూజ, రామలింగేశ్వరునికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, సూర్యునికి మహాసౌర పూర్వక అరుణ సూర్యనమస్కారాలు, రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై ఛాయా ఉష సమేత సూర్యనారాయణుని ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వేద పండితుల మంత్రోశ్చరణలు, మేళతాళాలు, మంగళవాద్యాల నడుమ కళ్యాణోత్సవాన్ని నిర్వహించగా తిలకించిన భక్తులు మంత్రముగ్దులయ్యారు. అనంతరం అష్టోత్తర శత క్షీరాభిషేకం కొనసాగింది. మహాగణపతి హోమం, నవగ్రహ, మృత్యుంజయ, అయుష్య, రుద్రస్వాహాకార, మహాసౌర పూర్వక, అరుణ, దుర్గాసూక్త హోమాలు జరుగగా స్వామి వారిని ఉరవకొండ మున్సిఫ్ మేజిస్ట్రేట్ డి.దుర్గా కళ్యాణి దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలతోపాటు తెలంగాణ, కర్నాటక ప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలిరాగా ఉదయం నుండి సాయంత్రం వరకు ఒకే రద్దీ కొనసాగింది. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉరవకొండ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రకాష్‌స్వామి, కమిటీ సభ్యులు మహేంద్రగౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

# మెరుగైన వైద్య సేవలు అందించడం గురుతర బాధ్యత

- ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులకు ప్రభుత్వ విప్ కాలవ సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ



నూతన సలహా మండలితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న కాలవ

**రాయదుర్గం, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:**

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందిసూనత సంతృప్తి పరిచేలా చూడటం గురుతర బాధ్యతని ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాల అభివృద్ధి సలహా మండలితొలి సమావేశం మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ హోదాలో కలవ పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి పేదలు ఎక్కువ భాగం వైద్య సేవల కోసం వస్తుంటారన్నారు. ఏ చిన్న సేవలు అవసరమైనా బళ్లారి, అనంతపురం వెళ్లే అవసరం రాకుండా వైద్య సేవల విస్తరణకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నానన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే 30పడకల ఆసుపత్రిని ఒకేసారి వంద పడకల సామర్థ్యానికి పెంచానన్నారు. అదనపు భవనాల నిర్మాణం పనులఉ కూడా అప్పుడే ప్రారంబించామన్నారు. 22మంది వైద్యులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం ఏడుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించుకోగలిగితే అన్ని రకాల వైద్య సేవలు ఒక్కడే లభిస్తాయన్నారు. అప్పుడు మెరుగైన వైద్య సేవల కోసం ఏ అనంతపురానికో, బళ్లారికో వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాదికారులతో ఇదివరకే చేర్చించామన్నారు. త్వరలో భర్తీ చేయనున్న వైద్య పోస్టుల్లో తమ ఆసుపత్రికి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని కోరామన్నారు. వారి నుండి సానుకూల సమాధానం వచ్చిందని తప్పక కొత్త సిబ్బంది త్వరలోనే వస్తారన్నారు. ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులు తరుచూ ఆసుత్రికి వస్తూ వైద్య సేవలపై ఆరా తీస్తుండాలని గుర్తు చేశారు. రోగులు, వారి బంధువులు, వైద్య సిబ్బందితో సమన్వయం చేస్తూ సేవలపై చర్చించాలన్నారు. ఏవైనా పొరపాటున్న జరిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లి చక్కదిద్దాలన్నారు. సిబ్బందితో గౌరవంగా మెలుగుతూ రోగులకు ఏ విధంగా మరింత మెరుగైన సేవలు అందించవచ్చో తగిన సూచనలు చేయాలన్నారు. ఆసుపత్రిని ప్రజలు తమ సొంత ఆస్థిగా బావించి వస్తారని, వారికి కూడా గౌరవించాలన్నారు. వైద్య సిబ్బంది కూడా తమ విధులపట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ పొరపాట్లకు ఆస్కారం లేకుండా పనిచేయాలన్నారు. ఈ సందర్బంగా ఆసుపత్రి అభివృద్ధి నూతన సలహా మండలి సభ్యులచే ఛైర్మెన్ కాలవ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని జె.జ్ఞానసుధ, కమిటి సభ్యులు సురేష్, కళ్యాణ్, శ్రీనివాస్, సంతప్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్నాయపల్లె మహానంద రెడ్డి పై సస్పెన్షన్ వేటు

- అదే దారిలో పూలకుంట శివారెడ్డి, బోయ నరేంద్ర పై వేటు - వైసిపి కేంద్ర కార్యాలయం ఆదేశాలు



**అనంతపురం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త బ్యూరో**

శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని రాప్తాడు నియోజకవర్గం లో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అనే కారణంతో ఐదుగురు వైసీపీ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది. వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ దిగువ పేర్కొన్న వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వైసిపి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. పార్టీ నుంచి సస్పెన్షన్ గురైన వారిలో రాప్తాడు మండలం ప్రసన్నయపల్లి చెందిన భూమిరెడ్డి మహానంద రెడ్డి, అనంతపురం రూరల్ మండలం పూలకుంటకు చెందిన మద్ది రెడ్డి శివారెడ్డి, కళ్యాణ్ దుర్గం మండలం మద్దినేనిపల్లికి చెందిన బోయ నరేంద్ర అలియాస్ రాజారామ్, రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన పొట్టి రమేష్, రామగిరి మండలం నసనకోటకు చెందిన కురువ ముత్యాలు ఉన్నారు.

వీరు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫారసుల మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

# కల్తీపాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తాం

- బండమీదపల్లిలో కల్తీ పాల ముఠా గుట్టు రట్టు
- శాంపిల్స్ హైదరాబాద్‌కు పంపించాం
- కల్తీపాలన్నీ డైరీలకే పంపుతున్నారు
- విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరిక

**అనంతపురం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త బ్యూరో**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కల్తీపాల విక్రయం జోరుగా సాగుతోందని ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. కల్తీ పాలను నేరుగా డైరీలకు పంపుతున్నారని, ఇది అనంతపురం జిల్లానే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కల్తీ పాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, దీనిపై నిగాబెట్టి రాప్తాడు నియోజకవర్గంలోని బండమీదపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున కల్తీపాల తయారీ విక్రయం కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా రామిరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో కల్తీ పాలకు సంబంధించి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అనేక రకాలైనటువంటి కెమికల్ ఉపయోగించి పాలను తయారు చేస్తున్న విషయాన్ని గుర్తించామన్నారు. పాలలో చిక్కదనం కోసం పామాయిల్, ఉప్పున మాల్టోడెక్సిన్ అనే రసాయన పదార్థాలను కలుపుతున్నారని, తాము ఆ ఇంటిపై దాడి చేసినప్పుడు ఆ రసాయన పదార్థాల నిల్వలు ఉన్నాయని ఆయన చెప్పారు. రామిరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా చాలా కాలంగా ఈ పాలను తయారుచేసి విక్రయిస్తున్న విషయాన్ని వెల్లడించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ మిగతా వాళ్ల కూడా కొందరు చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయని, ఇది జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్నట్లు తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. శాంపిల్స్ హైదరాబాద్‌లోని పరీక్ష కేంద్రాలకు పంపామని, ఫుడ్ సేఫ్టీ వాళ్లు కూడా పంపారని నివేదికలు వచ్చాక తగు చర్యలు తీసుకుంటా మన్నారు. కల్తీ పాలను పాల డైరీలు పంపుతున్నారని, నేరుగా వినియోగదారులు పంపలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. కల్తీ పాల వల్ల ప్రజలకు క్యాన్సర్ రావడమే కాకుండా అనేక రకాల జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బండమీదపల్లి గ్రామంలో నలుగురు వ్యక్తులు ఈ విధమైనటువంటి తయారీ చేసి నేరుగా పాల డైరీలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కల్తీపాల తయారీ భారీగా సాగుతోందని ప్రతి ఒక్కరూ దీన్ని గుర్తించి అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్న ఇటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో జిల్లాలో అనేక చోట్ల ఈ రకమైన పాల తయారీ చేసి విక్రయాలు చేస్తున్న విషయాన్ని పసిగట్టగా ఆఖరికి బండమీద పల్లిలో తయారీదారుల వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిఐ సద్గునుడు, ఏఓ వాసు ప్రకాష్, ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి తస్లీమ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విజిలెన్స్ డిఎస్పీ నాగభూషణం

# ప్రజల సమస్యల పరిష్కారమే మనందరి అజెండా

- గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రానీయ్యొద్దు
- అమడగూరు మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం
- అభివృద్ధిలో ముందుకు తీసుకుపోతాం
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

**అమడగూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

ప్రజల సమస్యల పరిష్కారమే మనందరి అజెండా అని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అమడగూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు డప్పువాయిద్యాలు, టపాసులు పేల్చి ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం పలికారు.

ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకుండా స్థానిక సర్పంచులు, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీరు. విద్యుత్, రోడ్లు, డ్రైనేజి, ఆరోగ్యం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు అభివృద్ధి జరగాలన్నారు. ప్రజలు సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే వాటికి పరిష్కారం చూపకుండా అదే పనిగా వారిని తిప్పుకోరాదన్నారు. పాఠశాలల్లో తాగునీరు. మరుగుదొడ్లు, నైట్‌వాచ్‌మెన్ సమస్య పరిష్కరించాలని ఎంఇఒ జిలాన్‌బాషకు సూచించారు. అమడగూరు హైస్కూల్ ప్రహరీగోడ మంజూరు చేయాలని సర్పంచు షబ్బీర్ ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వారికి అవసరమైన తగిన మందులు నిల్వ వుంచుకోవాలన్నారు. అమడగూరు ఎస్‌సి కాలనీలో చెత్త కుప్పలు ఎక్కువగా వున్నాయని వాటిని తొలగించాలని ఎంపిటిసి పెద్దప్పయ్య, సర్పంచు షబ్బీర్‌లకు సూచించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చికెన్ వ్యర్థాలు పడేయం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. చికెన్ వ్యర్థాలు ఎక్కడపడితేఅక్కడ పడవేయకుండా చూడాలని మండల ఇఒఆర్‌డి నసిమాకు సూచించారు. మండలంలో ఇళ్లు లేని పేదలు వుంటే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. మండలంలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య వుందని వాటిని పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. తక్షణం తగినన్ని ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఇ చంద్రానాయక్‌కు ఎమ్మెల్యే సూచించారు. విద్యుత్ కాంట్రాక్టర్లు, కేబుల్ వైర్ల కొరత వుందని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు సకాలంలో అందచేసే విధంగా చూస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అమడగూరు మండల అభివృద్ధి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మండలాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్లే బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులపై వుందన్నారు. అమడగూరు మండలంలో ఏపిఐఐసి ద్వారా సేకరించిన 1100ఎకరాల్లో పరిశ్రమలు తీసుకొచ్చి ఇక్కడ వున్న స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. అయితే అప్పట్లో భూమి సేకరించినప్పుడు 500మంది రైతులకు ఇంకా ప్రభుత్వం నుండి పరిహారం అందలేదని అర్బన్ ఫైనాన్స్ ఉపాధి కల్పన డైరెక్టర్ కాలేనాయక్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. మండలంలోని లోకోజిపల్లి, తుమ్మల, పూలకుంటపల్లి పంచాయతీల్లో చాలామంది రైతులు కొన్ని సంవత్సరాలుగా సాగు చేస్తున్నప్పటికి వారికి పట్టాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే అసైన్‌మెంట్ కమిటీలో వారికి సాగు పట్టాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అవసరమైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, పట్టణ మౌళిక వసతుల కల్పన రాష్ట్ర డైరెక్టర్ కాలేనాయక్, తహశీల్దార్ రామనాథరెడ్డి, ఎంపిడిఒ మునియప్ప, వైద్యాధికారి అపర్ణ, హౌసింగ్ ఏఇ రమేష్, ఇఒఆర్‌డి నసీమాబేగం, ఐకెపి ఏపిఎం భారతి, ఏపిఒ అమరావతి, వ్యవసాయ అధికారి వెంకట్‌రమణాచారి, హార్టికల్చర్ అధికారి లావణ్య, వెటర్నరీ అధికారి ధనుంజయ, ఆయా సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది, స్థానిక సర్పంచులు షబ్బీర్, సరస్వతి, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

# త్రాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

## జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**శ్రీసత్యసాయిజిల్లా, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

రానున్న వేసవిలో త్రాగునీటి నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కన్ఫరెన్స్ హాలు నందు ఆర్డబ్ల్యూఎస్, డిపిఓ ఆధ్వర్యంలో నీటి ఎద్దడి నివారణ కొరకు ముందస్తు ప్రణాళికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, ఆర్డబ్ల్యూఎస్సి ఈ మల్లికార్జున, డిపిఓ సమత సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఆరు నెలల్లో జిల్లాలో తాగునీటి సమస్యకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాకూడదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇని ఆదేశించారు రాబోయే 6 నెలల్లో నీటి సమస్యను నివారించడానికి ప్రాథమిక నిర్వహణ పనుల నిధులను సంబంధించిన ప్రణాళికలు అమలు చేయాలని డిపిఓను ఆదేశించారు జిల్లాలో రాబోయే 6 నెలల పాటు నీటి సమస్య తలెత్తకుండా జిల్లాలోని అందరి ఎంపీడీఓలతో సమన్వయం చేసుకుని సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జడ్పీ డిప్యూటీ సిఇఓను ఆదేశించారు. 32 మండలాలకు తాగునీటి సరఫరాకు పంపిన ప్రతిపాదనల నివేదికలు నాకు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి మరియు మండల స్థాయి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సమస్యలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి అధికారులుఆదేశించారుపంచాయతీల వారీగా సమస్యలు మరియు నీటి కొరతకు అవకాశం ఉన్న జాబితాను గుర్తించాలి. వచ్చే వారంలో సమర్పించాల్సిన టేబుల్ వారీగా పంచాయతీల వారీగా మరియు మండలాల వారీగా తాగునీటి వనరుల ఎక్సెల్ షీట్‌ను సిద్ధం చేయాలి. గత సంవత్సరం ఉపయోగించిన ట్యాంకర్ జాబితాను సేకరించి, మండలాన్ని కనుగొనడానికి ట్యాంకర్లు అవసరమైన చోట ప్రస్తుత నీటి పరిస్థితిని సరిపోల్చాలి పెండింగ్ బిల్లుల అన్నియు ప్రతిపాదనలను సిద్ధం చేసి అనంతపురం జడ్పీ కార్యాలయానికి అందజేయాలని ఆర్డబ్ల్యూఎస్సీ ఈ ఆదేశించారు. రేపు వారంలో నిర్వహించి నీటి ఎద్దడి నివారణ పై జరిగే సమావేశం నందు, సంబంధిత ఇంజనీర్లు, శ్రీ సత్యసాయి త్రాగునీటి పథకానికి సంబంధించిన అధికారులు, నీలకంఠారెడ్డి శ్రీరామ త్రాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు సిబిఆర్, పిఎబిఆర్ ఇంజనీర్లుఅందరూ కచ్చితంగా సమావేశానికి హాజరు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్ద కోట్లసెగ్మెంట్ చిన్న కోట్ల సెగ్మెంట్, గొల్లపల్లి సెగ్మెంట్ మండలాల ఎన్ని ఉన్నాయి సమీక్షించారు. మడకశిర, హిందూపురం, కదిరి, ధర్మవరం నియోజకవర్గాలలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, ఏ ఒక్కరు త్రాగునీటికి ఇబ్బంది పడరాదన్నారు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి సుబ్బారావు, డీఈవో కిష్టప్ప, డి ఎం అండ్ హెచ్ ఓ ఫిరోజ్ బేగం, ఐ సి డి ఎస్ పి డి నాగమల్లేశ్వరి, డి ఆర్ డి పి పిడి నరసయ్య, జల వనరుల శాఖ రాజశేఖర్, సంబంధిత ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

**బెలుగుప్ప, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**


చీనీ చెట్లకు నీరు పోస్తున్న రైతు

మండల కేంద్రంలో బోయ రాము సన్ / నారాయణప్ప అనే రైతు రెండు సంవత్సరాల క్రితం 2.50 ఎకరాలలో 342 చీనీ చెట్లను నాటారు. ఆ రైతు ప్రభుత్వం 2018 సంవత్సరంలో సబ్సిడితో సోలార్‌ను ఏర్పాటు చేసింది. కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు సోలార్‌ని పగలగొట్టడం వల్ల నీరు లేక మోటారు పని చేయడం లేదు. చీనీ చెట్లు అన్నీ మొత్తం ఎండిపోతున్నాయి. ప్రభుత్వం ఎన్నోసార్లు మండల ప్రజా పరిషత్ అధికారికి, తహశీల్దారుకి ఎన్నోసార్లు అర్జీ ఇచ్చినా కూడా చీమ కుట్టినట్లుగా లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఆ రైతుకు ఆ రెండున్నర ఎకరాల్లో అంతర్‌పంట కూడా వేశారు. కరువు ఉపాధికి సంబంధించిన అధికారులు ఫారం పండ్లను ఏర్పాటు చేస్తే మరళ నీటిని నిల్వ చేసుకోవచ్చని అధికారులకు కూడా అర్జీని పెట్టుకున్నారు. ఈ చీనీ చెట్లకు నీరు తగ్గడం వల్ల ఎండిపోయే ఆస్కారం ఉందని, వెంటనే వ్యవసాయ రైతుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం చేయాలని వేడుకున్నారు.

## మద్యం విక్రయిస్తూ పలువురు అరెస్ట్

**కంబదూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**


పట్టుకున్న మద్యాన్ని మీడియాకు చూపుతున్న పోలీసులు

కంబదూరు మండలం రాళ్లనంతపురం గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు సిబ్బంది తో కలిసి మంగళ వారం తనిఖీలు నిర్వ హించారు. ఇంట్లో ఒక వ్యక్తి ఏపీ మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ మీడియాకు తెలిపారు. నిందితుని వద్ద నుంచి 48 ఏపీ మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి నుంచి 48 ఏపీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం ఎన్ఫోర్స్మెంట్ విభాగం ఇన్స్పెక్టర్ అరుణ వారి సిబ్బందితో కలిసి శెట్టూరు మండలం తిప్పనపల్లి గ్రామంలో మహిళ వద్ద నుంచి 110 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి ,కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై హరి కృష్ణ, స్టేషన్ ఎస్ఎస్ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

## గీత కార్మికుల మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసుకోండి

**కంబదూరు, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త**

కంబదూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గీత కార్మికుల మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ పేర్కొన్నారు. కంబదూరు మండలంలో ఈడిగ కులస్థులకు ఒక మద్యం షాపు ను కేటాయించడం జరిగిందని మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ అనగా నేడు సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. దరఖాసుదారులు 2 లక్షలు నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపు లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించినట్లు చెప్పారు. కావున ఈ విషయం వారు గమనించాలని కోరారు.

## వివాదాస్పద భూమిని పరిశీలించిన తహసీల్దార్ సుమతి

**బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**


వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న తహసిల్దారు

మండల పరిధిలోని పోలేపల్లి గ్రామము నందు వివాదాస్పద భూమిని బ్రహ్మ సముద్రం తహసీల్దార్ ఆర్ సుమతి పరిశీలించారు. అనంతరం వారియింటివద్దకు వెళ్లి వారికి వారియొక్క భూమి సమస్య అడిగి తెలుసుకున్నారు. మీ దగ్గర ఉన్న రికార్డులను తీసుకొని కార్యాలయంనందు సంప్రదించాలని తెలియచేశారు ఈ కార్య క్రమంలో తహసీల్దార్ సుమతి అర్ ఐ నాగిరెడ్డి.వి.అర్ ఓ హనుమంతరావు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో శివమాలదారుడు మృతి

**రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:**


ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన శివమాలదారుడు. మంజునాథ్

పట్టణ సమీపంలోని ఆర్టీఓ కార్యాలయం వద్ద మంగళవారం సాయంకాలం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివమాలదారుడు మంజునాథ్(22) మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైయ్యాయి. వివరాల మేరకు భూపసముద్రం గ్రామానికి చెందిన శివమాల భక్తులు మంజనాథ, చిత్రలింగ, మంజునాథలు ద్విచక్ర వాహనంలో రాయదుర్గంలో పూజా సామాగ్రి కొనుగోలుచేసి భూపసముద్రం గ్రామానికి తిరిగి వెళ్తుండగా వెనుకవైపు నుండి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలైయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. మంజునాథ అనే యువకుడు తీవ్రంగా గాయపడటంతో చికిత్స అందిచేలోపే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ జయనాయక్ సంఘటనాస్థలాన్ని వెళ్లి పరిశీలించి ట్రాక్టర్ డ్రైవర్ మరియు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయానాయక్ తెలిపారు. ఒక్కొగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబం దిగ్భాందికి గురైతంది.

## గుత్తిలో రైల్వే కార్మికుల ర్యాలీ

**గుత్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

1925 ఫిబ్రవరి3వతేదీనాటికి విద్యుత్ఇంజన్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక ఎలక్ట్రికల్ డీజిల్ లోకో డీజిల్‌షెడ్‌లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీజిల్ షెడ్ సీనియర్ డిఎంఇ ప్రమోద్‌కుమార్ ప్రారంభించారు. ర్యాలీ బుకింగ్ కార్యాలయం మీదుగా అంబేద్కర్ పార్కు రైల్వే ఆసుపత్రి వరకు జరిగింది. ఈ విద్యుత్ ఇంజన్ వల్ల జనరేటీవ్ బ్రేకింగ్ వల్ల తక్కువ ఎనర్జీ వాడుకుని ఎక్కువ లోడు లాగుతుందని, విద్యుత్ ఇంజన్ వల్ల గ్లోబల్ వార్మిగ్ తగ్గుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఎంఇ అశోక్‌గౌడ్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సుంకన్న, మనోజ్, ప్రభుదాసు, విజయానంద్, కార్మిక సంఘం ప్రతినిధులు, డిజిల్ షెడ్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


రైల్వే కార్మికులు ర్యాలీ చేస్తున్న దృశ్యం

## మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం


మున్సిపల్ చైర్మన్ రమేష్ ను సన్మానిస్తున్న ఆకుల ఉమేష్, తదితరులు

**హిందూపురం టౌన్ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త**

హిందూపురం నూతన మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన డి,ఇరమేష్‌ను మంగళవారం జనసేననియోజకవర్గ ఇన్చార్జి ఆకుల ఉమేష్, చక్రి తదితరులు డి,ఇ రమేష్‌నుకలిసి ఘనంగాసన్మానించి శుభాకాంక్షలుతెలిపారు మీ సారథ్యంలో హిందూపురం పట్టణం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు అదే విధంగా సీనియర్ నాయకులు నర్సోజీరావు, నెట్టప్ప తదితరులు మున్సిపల్ చైర్మన్ రమేష్ ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## అన్నదానానికి మున్సిపల్ చైర్మన్ విరాళం


అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్మన్

**హిందూపురం టౌన్ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త**

శ్రీయోగినారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి నూతన మున్సిపల్ చైర్మన్ డి,ఈ రమేష్ మంగళవారం 6000 రూపాయలు విరాళంగా నిర్వాహకులకు అందజేశారు అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో 188 వ రోజు 380 మందికి అన్నదానం నిర్వహించినట్లు యోగి నారాయణ సేవా సమితి అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు ఈ సందర్భంగా దాత రమేష్ ను నిర్వాహకులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగేష్, మహేష్, రాజ్యలక్ష్మి మోహన్, అంజి, వెంకటరమణప్ప, గొల్లన్న, రామకృష్ణ, వరుణ్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

## అయిదు వేల శివలింగాల తయారీ


శివలింగాలు తయారు చేస్తున్న భక్తులు

**హిందూపురం ఫిబ్రవరి 04 ప్రభాతవార్త**

ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా శ్రీ వీరశైవ లింగాయత్ సంఘం, అక్క మహాదేవి మహిళా సంఘం ఆధ్వర్యంలో అయిదు వేల శివలింగాలను తయారు చేస్తున్నారు పట్టణంలోని మెయిన్ బజార్లో వెలసిన శ్రీ బసవేశ్వర శివాలయంలో శివరాత్రి పండుగ రోజు శివలింగాలను అక్కడ ఉంచి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించనున్నట్లు భక్తుల తెలిపారు.

## ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


సత్య సాయి జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ నూతన కమిటీ

**సత్యసాయి జిల్లా వైద్యము ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

సత్యసాయి జిల్లా ఏపీ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ తరపున నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు ఎన్నికల అధికారిగా అనంతపురం జిల్లా అధ్యక్షులు శ్రీధర్ సమన్వయ అధికారిగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం హాజరై ల్యాబ్ టెక్నీషియన్ యొక్క ప్రాముఖ్యతను, వారి బాధ్యతలను తెలియ చేశారు. అనంతరం వారి సమస్యలను విని కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. అలాగే తన పరిధిలో ఉన్న సమస్యలను తెలపవలెనని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ముందుకెళ్దాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, అనంతపురం జిల్లా సెక్రటరీ వేణుగోపాల్, మరియు ట్రెజరర్ శ్రీనివాసులు , నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా నూతన జిల్లా అధ్యక్షులుగా జనార్దన్, సెక్రటరీగా మస్తాన్వలి , ట్రెజరర్ గా అనిల్ నాయక్ ని అసోసియేట్ ప్రెసిడెంట్ గా నాగభూషణం ని, వైస్ ప్రెసిడెంట్ గా సునీత ని , కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు.

## శ్రీ వాసవి మాత వెండి ఉత్సవ విగ్రహంనకు యువత

**కణేకల్లు, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో వెలిసిన శ్రీ కన్యకాపరమేశ్వరి వాసవిమాత దేవాలయం నందు నేటి వరకూ పంచలోహములతో అమ్మవారు ఉత్సవ విగ్రహం ఉండేది, ఆర్యవైశ్యులు చేయూతతో దాదాపు 15కేజీల వెండితో అమ్మవారి విగ్రహం ప్రభావలి చేయించారు. మంగళవారం శ్రీ కన్యకాపరమేశ్వరి వాసవి మాత వెండి ఉత్సవ విగ్రహాన్ని ప్రభావలి ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఏడి తిమ్మప్ప, రాఘవేంద్రగుప్తా, చంద్రశేఖర్‌గుప్తా, బద్రీనాథ్ ఆర్యవైశ్యులు అందుకున్నారు. గతంలో అమ్మవారి ఊరేగింపుకు పంచలోహములతో ప్రతిష్టించిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించే వారని తెలిపారు. ఆర్యవైశ్యులు సాయ సహకారాలతో శ్రీ కన్యకాపరమేశ్వరి వాసవిమాత వెండి ఉత్సవ విగ్రహం ప్రభావలి చేయించడం జరిగిందన్నారు వీరితోపాటు రాజా, సుబ్బయ్య, సత్యనారాయణ, సతీష్, యోగేశ్వర్, సాయిచరణ్ తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.


నూతన వెండి విగ్రహం చూపుతున్న ఆర్యవైశ్య సభ్యులు

## మంత్రి సవితమ్మ నేడు హిందూపురానికి మంత్రి రాక

**హిందూపురం ఫిబ్రవరి 04 ప్రభాతవార్త**

నేడు హిందూపురం పట్టణానికి రాష్ట్ర బీసీసంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ రానున్నారు మధ్యాహ్నం 12 గంటలకు హిందూపురం పట్టణం గుడ్డంలోనీ శ్రీ రంగనాథ స్వామి ఆలయం వద్ద జరిగే తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రంను మంత్రి సవితమ్మ ప్రారంభించనున్నట్లూ పరిగి మండలం టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి తెలిపారు.

## మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు వినతిపత్రం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం.

**డి.హీరేహాళ్, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:**

మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు స్థలం కేటాయించాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజుతో కలిపి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన పలువురు వాల్మీకి సోదరులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందించారు. మంగళవారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని హాలో వాల్మీకి సోదరులు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌ను సంప్రదించి మండల రెవెన్యూ కార్యాలయంకు చేరుకుని తహసీల్దార్‌కు మహర్షి వాల్మీకి విగ్రహప్రతిష్టాపన విషయం చర్చించారు. గ్రామ పరిధిలోని 150ఏ జాతీయ రహదారి ప్రక్కన 20అడుగుల రస్తా ఉందని ఆ రస్తాను ఇతరులు అన్యాక్రాంతం చేశారని, ఆ స్థలం సర్వేచేసి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన చేసుందుకు కేటాయించాలని వారు తహసీల్దారును కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు తహసీల్దార్‌తో మాట్లాడుతూ చిన్న గ్రామాల్లో సైతం వాల్మీకి విగ్రహాలు ఏర్పాటు చేశారని, మండల కేంద్రంలో మహర్షి వాల్మీకి విగ్రహం లేకపోవడం బాధకలుగుతుం దని, అందుకు మీ సహకారం అందించాలని ఆయన తహసీల్దార్‌కు విన్నవిం చారు. ఈ సందర్భంగా వాల్మీకి సోదరులందరూ తహసీల్దార్‌తో మాట్లాడుతూ నేడు ఏపల్లెలకు వెళ్లినా మహర్షి వాల్మీకి విగ్రహాలు ఏర్పాటుచేసి జయంతని ఘనంగా నిర్వహిస్తున్నారని, మీరు తమకు సహాయ సహకారాలు అందించి విగ్రహ ప్రతిష్టాపన కు చేయూతనిచ్చి ఈ ఏడాది వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకునేందుకు సహకరించాలని వాల్మీకి సామాజిక వర్గం సోదరులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి భర్త ఎర్రిస్వామి, కనిగిర వన్నూరుస్వామి, నాగరాజు, సూరీ, లోకేష్, గంటా వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

## ఉలవ పంట దగ్ధం..

**రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:**


దగ్ధమైన ఉలవ పంట...

కోతిగుట్ట సమీపంలోని కృష్ణాలో అవుట్లో 20ఎకరాల్లో పండించిన ఉలవ పంట నిలువ ఉంచడంతో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైనట్లు మాజీ సర్పంచ్ గురుసిద్దప్ప మంగళవారం తమ ఆవేదన వ్యక్తం చేశారు. 20ఎకరాల్లో పండించిన పంటను నిలువ ఉంచడంతో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని, దీంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాసక సిబ్బంది సంఘటనాస్థలానికి వచ్చేలోపు మంటలు ఎగిసిపడటంతో మంటలను ఆర్పారు. దీంతో రూ. 4లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మీ స్ఫూర్తికి మా సహకారం.... డిఎల్‌డిఓ


సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డిఓ నాగేశ్వరరావు.

**డి.హీరేహాళ్, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:**

పంచాయితీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పనితీరుకు అబినందనలు మీ స్ఫూర్తికి అధికారులుగా మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మండలంలోను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని డిఎల్‌డిఓ నాగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని అభినందిచారు. మంగళవారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలలో ఎంపిడిఓ దాస్‌నాయక్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి నిర్వహించిన అభినందన, సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరంపురం జిల్లాకు మారుమూలన కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న డి.హీరేహాళ్ మండలం ఫించన్ల పంపిణీలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపిన ఫించను పంపిణీచేసిన సిబ్బందికి, వారికి సహాయ సహకారాలు అందించి అండగా నిలిచిన మండల స్థాయి అధికారులను డిఎల్‌డిఓ ప్రశంసించారు. కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఈ మండలంకు సాంకేతికపరమైన అడ్డంకులు, ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికి మధ్యాహ్నంకే 12మంది ఫించన్లు పూర్తిస్థాయిలో వంద శాతం పంపిణీ చేశారని, మిగతా సిబ్బంది సైతం సకాలంలో ఫించనున్న పంపిణీ పూర్తి చేయడంతో మండలంముకు మొదటి స్థానం లభించిందని రాబోవు రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి మరిన్ని సన్మానాలు అందుకోవాలని, జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా అవార్డులు సైతం అందుకునేందుకు సంసిద్దులు కావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎంపిడిఓ మాట్లాడుతూ ఫించన్లు పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులను ప్రసంశిస్తూ మండలంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు తదితర 26రకాల ఫించన్ లబ్దిదారులు 5081ఉన్నారన్నారు. ఈ ఫించన్ లబ్దిదారుల్లో 5004మందికి ఫించనున్న సకాలంలో అందించడం జరిగిందని ఫించన్ సొమ్ము రూ. 2,17,64,500లు పంపిణీ చేయాల్సి ఉండగా రూ. 2,13,88,000లు లబ్దిదారులకు ఫించన్ సొమ్ము అందించి లబ్దిదారుల మన్ననలు పొందడం ఆనందించదగ్గ విషయమని ఎంపిడిఓ తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏపిఓ ఓపన్న ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పశువులు, గొర్రెలు, కోళ్ల షెడ్లను వందశాతం పూరినతచేసి మండలంను ప్రథమ స్థానంలలో నిలిపిన ఉపాధి హామీ ఇంజనీర్, టెక్నికల్ అసిస్టెంట్లను ఆయన అబినందించారు. సచివాలయ మహిళా పోలీస్ శ్వేత, ఓబులాపురం సచివాలయ ఆరోగ్య కార్యకర్త శ్రావణిలతో పాటు సకాలంలో ఫించన్ పంపిణీ కార్యక్రమం పూర్తిచేసిన వారందరిని అధికారులు సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాలనాధికారి బలరాంరావు, పంచాయితీల విస్తరణాధికారి యోగానంద, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశులు, పంచాయితీ కార్యదర్శులు వెంకటరమణ, కృష్ణయ్య, రాజు, సిబ్బంది రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

## వైకాపా నాయకుని మృతికి నివాళులు అర్పించిన నేతలు


నివాళులు అర్పిస్తున్న వైసిపి ఇన్‌చార్జ్ టిఎస్ దీపిక

**లేపాక్షి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని నాయనపల్లి గ్రామానికి చెందిన వైకాపా నేత నరసప్ప మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి ఇన్‌చార్జ్ టిఎస్ దీపిక, వైస్‌ఎంపిపి అంజన్‌రెడ్డి, కన్వీనర్ నిస్సార్‌అహ్మద్‌లు గ్రామానికి వెళ్లి నరసప్ప భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. వైకాపా ఆవిర్భావం నుండి నరసప్ప కుటుంబం పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసిందన్నారు. అతని లేని లోటు ఎవరు తీర్చలేరన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిప్పన్న, అన్సర్, చాంద్, షేక్‌తన్వీర్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పన్నులపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై లేదు

**- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం**

**- అధికారుల తీరుతో అనారోగ్యం పాలవుతున్న ప్రజలు**


మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**గుంతకల్లు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

మున్సిపల్ అధికారులకు పన్నులపై వున్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై లేదని సిపిఐఎంఎల్ న్యూ డమొక్రసీ పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి సురేష్ అన్నారు. మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కమీషనర్ నయీమ్‌అహమ్మద్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. అధికారుల తీరుతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఏ మూలకు చూసినా చెత్త పేరుకపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఇళ్ల వద్దకు పది రోజులకు ఒకసారి కూడా చెత్తను సేకరించడానికి రాకపోవడంతో ప్రజలు దాన్ని రోడ్లపైకి వేయాల్సి వస్తోందన్నారు. అలాగే రోడ్లు, డ్రైనేజీలు కూడా శుభ్రం చేయకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడాల్సి వస్తుందన్నారు. కమీషనర్ మాత్రం ఉదయాన్నే పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నానంటూ ఫోటోలకు ఫోజులు ఇస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు తప్పా పనులు మాత్రం చేయించడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను రెండు రోజులకు ఒకసారైనా సేకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో రఘునాథ్‌రెడ్డి, నారాయణ, విశ్వనాథ్, గోపి, బాష, తదితరులు పాల్గొన్నారు.

## దండు మరిగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

**-విగ్రహానికి రూ.1.30 లక్షల విరాళం అందచేసిన లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందన్**


విరాళం అందచేస్తున్న రామానందన్

**లేపాక్షి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

లేపాక్షి పరిధిలోని రాజీవ్‌కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న దండు మరిగమ్మ ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయనను కలిసిన ఆలయ కమిటీ సభ్యులకు 1.30 లక్షల రూపాయల విరాళాన్ని అందచేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అందచేస్తామని గతంలో చెప్పిన మాట మేరకు నగదును అందచేస్తున్నట్లు రామానందన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

## మద్యం రవాణా కేసులో గోరంట్ల వాసులకు ఏడాది జైలు శిక్ష

**- పెనుకొండ కోర్టు తీర్పు వెల్లడి..శిక్షతో పాటు రూ.2లక్షల జరిమానా విధింపు**

**గోరంట్ల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**


గోరంట్ల సిఐలు ఫైల్‌ఫోటో

కర్ణాటక నుండి గోరంట్ల మండలానికి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడి కేసు నేరం రుజువు కావడంతో ఇద్దరి నిందితులకు మంగళవారం పెనుకొండ కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు 2 లక్షల రూపాయల జరిమానా విధించినట్లు గోరంట్ల సిఐ శేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. 2020 జూన్ 16న గోరంట్ల పట్టణంలోని ఆంజనేయస్వామి కాలనీకి చెందిన మంజునాథ్, వద్దే రామాంజనేయులు అనే వ్యక్తులు అనుమతులు లేని కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అప్పటి సిఐ జయనాయక్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ముద్దాయిలను రిమాండ్‌కు తరలించి కోర్టుకు చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా ప్రస్తుత సిఐ శేఖర్ ఆధ్వర్యంలో గోరంట్ల కోర్టు కానిస్టేబుళ్లు భాస్కర్, నారాయణస్వామిలు సాక్షులను కోర్టుకు సకాలంలో ప్రవేశపెట్టడంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామల వాదనలు వినిపించారని అయితే ముద్దాయిలు చేసిన నేరం రుజువు కావడంతో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప తీర్పును వెలువరిస్తూ ముద్దాయిలైన మంజునాథ్, వద్దే రామాంజనేయులుకు ఏడాది జైలు శిక్షతో పాటు 2 లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించినట్లు సిఐ శేఖర్ తెలిపారు.

## రుణాల కోసం 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి

**-మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవికుమార్**

**ఉరవకొండ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

2024-25 ఆర్థికసంవత్సరానికి స్వయంఉపాధి పథకం జీవనోపాధులకు రుణ సౌకర్యం పొందడానికిగాను అర్హత కల్గిన బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు (బలిజ) కులాలకు చెందిన వారు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కల్గినవారు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

03ATP04_03ATP04.qxd 04-02-2025 PM 10:40 Page 1



## వివేకానంద యోగ కేంద్రంచే సామూహిక సూర్య నమస్కారములు



సూర్య నమస్కారములు చేస్తున్న దృశ్యం

**అనంతపురం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త బ్యూరో**

వివేకానంద యోగ కేంద్రం ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం రథసప్తమికి సామూహిక సూర్య నమస్కారములు ఒక్క రౌండ్‌కు 12 ఆసనాలతో 108 రౌండ్లు మంత్ర ఉచ్చరణతో చేయుచున్నారు. ఈ రోజు ఆర్ట్స్ కాలేజ్ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో అనంతపురం పట్టణ ప్రజలు, యోగ అభిమానులు, యోగ సాధకులు, విద్యార్థిని విద్యార్థులు సుమారు 300 మంది సామూహిక సూర్య నమస్కారాలతో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీమ్ రాజశేఖర్‌రెడ్డి అధ్యఓతన వహించి పట్టణములో ఉచిత యోగ తరగతులను ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ హాజరై యోగసాధకులను అందర్నీ అభినందించారు. రథసప్తమి యొక్క విశిష్టతను విద్యార్థులకు, యోగ సాధకులకు చక్కగా వివరించి, ప్రతిరోజు సూర్య నమస్కారములు చేయుటం వలన సంపూర్ణమైన ఆరోగ్యం, మానసిక పరిపక్వత మానసిక ఒత్తిడి నుండి దూరము కావటానికి, విద్యార్థులకు ఏకాగ్రత కోసం ఈ సూర్య నమస్కారములు బాగా ఉపయోగకరము అని వారు తమ సందేశంలో పేర్కొన్నారు. ఎస్ఎస్ అసోషియేషన్ ఇంజినీర్ ఎస్.సుధాకర్ అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతిరోజు సూర్య నమస్కారము చేయటం వలన శరీరమునకు కావాల్సిన విటమిన్ డి అధిక భాగంలో లభించునని తెలియజేశారు. యోగ కేంద్ర అధ్యక్షులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, వై.ఆంజినేయులు, ఈఎస్ మారుతి ప్రసాద్, సుధాకర్, మూర్తి, పుల్లయ్య, వై.తారకరామయ్య, గురు రాజారావు, ఎస్.దివాకర్, కృష్ణ, కృష్ణవేణి మొదలగు కమిటీ సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అదే విధంగా ఆర్.కాలేజీ యోగా గురువు వై.ఆంజినేయులు, మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, రమణ, రాజగోపాల్ మొదలగు వారు కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపిఆర్ఓ గురుస్వామి పాల్గొన్నారు.

## కరాటేలో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థి ఆర్ ప్రణవి

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



కరాటేలో సత్తా చాటిన విద్యార్థి ఆర్.ప్రణవి

అనంతపురం నగరం స్థానిక ఆదిమూర్తి నగర్‌లోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం తొమ్మిదవ బ్రాంచ్ పాఠశాలకు చెందిన నాలుగవ తరగతి విద్యార్థిని ఆర్.ప్రణవి వైజాగ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే ఈ వెంట్‌లో తన ప్రతిభను చాటి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. తమ పాఠశాల విద్యార్థి కరాటేలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధజంచడం పట్ల శ్రీ చైతన్య పాఠశాల ఏజిఎం సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అమ్మాయిలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటాలని అలాంటి వారిని ముందుండి తాము ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రణవి ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులను అభినందించారు. గోల్డ్ మ ఎడల్ సాధించిన ఆర్.ప్రణవిని శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ శాంత, డిస్టిక్ కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, పాఠశాల డీన్ గంగాధర్, ప్రైమరీ ఇన్‌చార్జ్ దీప, ప్రీప ప్రైమరీ ఇన్‌చార్జ్ బతుల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలు ఆరోగ్య సేవలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్యాధికారి యుగంధర్



వైద్యాధికారి యుగంధర్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

**రాప్తాడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వైద్యశాలలో వైద్యులు శివకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శాల పరిధిలోని ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి యుగంధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలు వారివారి ఏరియా పరిధిలో ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, ఆరోగ్య సేవలు గురించి తదితర వాటి గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని అదే విధంగా ఆశా కార్యకర్తల పరిధిలో క్షయ రోగులు, కుష్టు రోగులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులున్న వారిని గుర్తించి వైద్య శాలకు తీసుకొనిరావాలని గర్భిణీలు నెల వారి టీకాలు వేయించుకుంటున్నారా లేదా మందులు తీసుకుంటున్నారా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటున్నారా లేదా మందులు తీసుకుంటున్నారా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. అదే విధంగా ఆశా కార్యకర్తలు ఉపయోగించే మొబైల్ యాప్ గురించి వివరంగా తెలియజేశారు. ఈ సమావేశంలో సిహెచ్ఓ శివ ప్రసాద్, సూపర్‌వైజర్ అరుణ, నరసింహా, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఏఎన్ఎంలు, వైద్యశాల ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మగ్దూం మొహియుద్దీన్ నేటి తరానికి ఆదర్శం

- ఎస్‌టియు నేత ఎస్.రమణారెడ్డి

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**




మాట్లాడుతున్న ఎస్‌టియు నేత ఎస్.రమణారెడ్డి

ఉద్యమ కెరటం, పోరాట యోధుడు, నిస్స హాయుల ఆశాజ్యోతి, మగ్దూం జీవితం నేటి తరానికి ఆదర్శం అని ఎస్టీయు సంఘం రూపకర్త వ్యవస్థాపకులు, కమ్యూనిస్టు, ఉపాధ్యా యుల చైతన్య కిరణం కామ్రేడ్ మగ్దూం మొహి యుద్దీన్ అని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.రమణారెడ్డి కొనియాడారు. ఎస్టియు కార్యాలయం, అనంతపురంలో ఎస్టీయు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్ మగ్దూం మొహిద్దీన్ 117వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్స్ సురేష్, కృష్ణమోహన్, సీనియర్ నాయకులు అజయ్‌కుమార్, జిల్లా నాయకులు బాబ్జి నాయక్, రామకృష్ణ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ని కలిసిన షేక్ బాబ్జాన్

**నంబులపూలకుంట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

జడ్పిహెచ్ఎస్‌లో పిల్లలకు పెట్టవలసిన ఆమార పదార్థాలు, దుర్వినియోగానికి పాల్పడిన స్కూల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి మైనార్టీ మోర్చ మండల అధ్యక్షులు షేక్ చాంద్ బాషా, సీనియర్ నాయకులు మారకందిన్నే రమణ, జిల్లా జంర్డల్ సెక్రెటరీ గురుపురెడ్డి పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుకోండి

-పదో తరగతి విద్యార్థులకు బీసీ వెల్ఫేర్ డీడీ సూచన

-విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తున్న డీడీ ఖుష్బు కొఠారి, దాత వార్త రిపోర్టర్ బి.మల్లేసు

నగరంలోని కెఎస్ఎన్ మహిళా మహిళా డిగ్రీ కళా శాలలో అనంతపురం డివిజన్ పరిధిలోని బీసీ హాస్టల్స్‌లోని పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ-శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ వెల్ఫేర డీడీ ఖుష్బూ కొఠారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా బీసీ హాస్టల్స్‌లో 647 మంది విద్యార్థులు ఉన్నారని, ఈ విద్యార్థులకు పరీక్షలపై ఉన్న భయం పోగొట్టడానికి, ప్రేరణ కలిగించడానికి, సబ్జెక్టులపై శిక్షణ ఇవ్వడానికి ఈనెల 2వ తేదీ నుండి 6వ తేదీ వరకు ప్రేరణ-శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 17వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతాయని, ఇప్పటికి 41 రోజుల సమయం ఉందన్నారు. అందువలన సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలన్నారు. అలాగే క్రియేటర్ క్రిష్ణ విద్యార్థులలో ప్రేరణ కలిగించారు. అలాగే గణితం, సైన్స్, ఇంగ్లీష్ టీచర్లు సత్య ప్రసాద్, శివప్రసాద్, నాగేంద్ర, చంద్రశేఖర్, అబ్దుల్ మునాఫ్, సురేంద్రబాబులు ఆయా సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం డీడీ సొంత ఖర్చులతో రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, అనంతపురం వార్త రిపోర్టర్ బి.మల్లేసు తన సొంత ఖర్చు రూ.పది వేలు విలువ చేసే జామెట్రీ బాక్సులను 227 మంది విద్యార్థులకు పంపిణీ చేసి, ఆల్‌దిబెస్ట్ తెలియజేశారు. ఫిజికల్ సైన్స్ ఫోరం కె.ఆనందభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూవో సుభాషిణి, బీసీ హాస్టల్స్ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్, జిల్లా అధ్యక్షులు మారుతి ప్రసాద్, ఠాగూర్, నాగరాజు, శ్రీనివాసులు, షహంతాజ్, అరుణ, సుబ్ర మణ్యం, నారాయణనాయక్, శాంతమ్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డి.వై కుళ్లాయప్ప నేత్ర స్వీకరణ కేంద్రం ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

**అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో డివై కుళ్లాయప్ప నేత్ర స్వీకరణ కేంద్రం ప్రారంభమైంది. ఈ కేంద్రం దాతల నుండి నేత్రాలను సేకరించి అంధులకు కాంతిని అందించడానికి సహాయపడుతుంది. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, జిల్లా అంధత్వ నివారణ సంస్థ డాక్టర్ సైదన్న, ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ సభ్యులు కాపు రామచంద్రారెడ్డి, అనంతపురం రెడ్ క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి, డాక్టర్ జగన్‌మోహన్, ఐఆర్‌సిఎస్ అనంతపురం వైస్‌చైర్మన్ డాక్టర్ లక్ష్మణప్రసాద్, జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ సభ్యులు డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, అలంబన జనార్ధన్, ట్రెజరర్ మల్లికార్జున, సుబ్రమణ్యం, రెడ్‌క్రాస్ ఐ ఎంట్రీ కమిటీ సభ్యులు చంద్రకాంత్‌నాయుడు, డాక్టర్ తిరుపతినాయుడు, డాక్టర్ భానుకిరణ్, లయన్స్‌క్లబ్ ప్రతినిధి విరూపాక్షరెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధి భవానికుమార్, బేగం, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ అక్బర్‌సాహెబ్, డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ బాయపురెడ్డి, డాక్టర్ సిద్ధన్న, ఎస్ఎస్‌బిఎన్ ఎన్‌సిసి, ఎస్‌వి డిగ్రీ కళాశాల నర్సింగ్ కాలేజీల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రెడ్ క్రాస్ శరవేగంగా దూసుకపోతోందని ఇప్పటికే మెంబర్‌షిప్, సిఎస్ఆర్ కార్యక్రమాల్లో రాష్ట్రంలోనే ముందున్నామన్నారు. కేవలం కార్నియా సేకరణకు పరిమితమైన ఈ రెడ్ క్రాస్ కంటి కేంద్రం అతి త్వరలోనే పూర్తిస్థాయి కంటి మార్పిడి చికిత్స చేయగలిగే కేంద్రంగా కావాలని తద్వారా జిల్లాలో సేకరించిన కార్నియా జిల్లా వారికి ఉపయోగపడుతుందని దానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు.

## వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ కోసం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతి

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకుల చిరకాల కోరిక ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ అంశం గురించి ఎమ్మెల్యే పరిటాల సునీతకు రాప్తాడు మండల వాల్మీకి వింగ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మంగళవారం రాప్తాడు నియోజకవర్గంలోని చేపట్ల గ్రామానికి విచ్చేసిన సందర్భంగా రాప్తాడు మండలం యూత్ వింగ్ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశం గతంలో మా అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామని వాల్మీకుల విషయంలో చంద్రబాబునాయుడుకు స్పష్టత ఉందని తెలిపారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చే విధంగా కృషి చేస్తానని మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు వాల్మీకి యూత్ వింగ్ మండల అధ్యక్షుడు కొండపల్లి మోహన, రామినేపల్లి రాము, నరేష్, బిసి సెల్ కులాయప్ప కరుణ సుధీర్, వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

## నార్పలలో వైభవంగా రథసప్తమి వేడుకలు



స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

**నార్పల,ఫిబ్రవరి 04 ప్రభాతవార్త**

నార్పలలో శ్రీ శ్రీ చక్ర శ్రీనివాసస్వామి ఆలయంలో రథసప్తమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పంచ హారతులు నిర్వహించగా, భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.సూర్యప్రభ వాహనంపై భక్తులకెరుగు శ్రీనివాసస్వామి ఉదయం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. ప్రధాన వీధుల గుండా సాగిన ఈ శోభాయాత్రలో భక్తులు నారికేళాలను సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి తమ భక్తిని చాటుకున్నారు.ఆలయ అర్చకులు మాడుగుల రఘునాథ శర్మ ఆధ్వర్యం లో ఈ పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగాయి.

## ఆర్టీసి డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమం

- ఏపిఎస్ఆర్టీసి రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని

**అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



సర్టిఫికెట్ అందచేస్తున్న ఆర్ఎం

అనంతపురం జిల్లాలోని ఆర్టీసి రీజినల్ మేనేజర్ కార్యాలయంలో మంగళవారం యాక్సిడెంట్స్ ప్రోన్ డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఏపిఎస్ఆర్టీసి రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని ప్రారంభించారు. గత సంవత్సర కాలంలో యాక్సిడెంట్లు చేసిన డ్రైవర్లకు యాక్సిడెంట్లు నివారించుకుంటూ రక్షణాత్మకమైన డ్రైవింగ్ ఎలా చేయాలో వివరించారు. గత నవంబర్‌లో గార్లదిన్నె వద్ద జరిగిన ధర్మవరం బస్సు యాక్సిడెంట్‌ను చూపించి అక్కడ ఎలాంటి సందర్భంలో ఆ యాక్సిడెంట్ జరిగిందో ఆ యాక్సిడెంట్‌ను జరగకుండా ఎలా నివారించవచ్చు అని డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు. ఇక మీదట ఇలా యాక్సిడెంట్లు జరగకుండా సంస్థ నినాదం "ఆర్టీసిలో ప్రయాణం సురక్షితం సుఖవంతం మరియు శుభప్రదం"ను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. అనంతరం ట్రైనింగ్ ఇచ్చిన డ్రైవర్లకు ఆర్ఎం సర్టిఫికెట్లను అందచేశారు. ఇప్పటి నుండి ప్రతి మంగళవారం, శుక్రవారం యాక్సిడెంట్లు ప్రోన్ డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం చేపడతామని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిటిఎం కె. శ్రీలక్ష్మి, తాడిపత్రి డిపో మేనేజర్ శంకర్, ఏఎంఎఫ్ జయచంద్ర, వివిధ డిపోల సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన గ్రామాల కోసం చెత్త సంపద కేంద్రాలు అవసరం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**నార్పల,ఫిబ్రవరి 04 ప్రభాతవార్త**

నార్పల మండలంలోని అన్ని గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను త్వరగా వినియోగంలోకి తేవాలని అధికారులు సూచించారు. మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎంపిడిఓ గంగావతి, ఈఓఆర్డి శైలజ రాణి,ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ జనార్ధన్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో చర్చించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డి శైలజ రాణి మాట్లాడుతూ, గ్రామాల్లో చెత్తను సమర్థవంతంగా నిర్వహించేందుకు చెత్త సంపద కేంద్రాలు కీలకం అని తెలిపారు.ప్రతి పంచాయతీలో క్లాప్ మిత్రులను నియమించి తడి,పొడి చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ జనార్ధన్ మాట్లాడుతూ,కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించి,చెత్తను రీసైకిల్ చేయడం ద్వారా సంపదగా మార్చే విధానాన్ని అందు బాటులోకి తీసుకురావాలి అని చెప్పారు.ఈ సమావేశంలో సర్పంచులు రామాంజ నేయులు, కుల్లాయరెడ్డి,రాంభూపాల్ రెడ్డి,నాగార్జున, కుళ్ళయప్ప, రమణ కుమారి,రామంజీనమ్మ, శివలక్ష్మీ,స్వప్న,నాగన్న పాల్గొన్నారు. కార్యదర్శులు శ్యామల,శ్రీనివాసులు, వెంకటరమణ,గోపాలరెడ్డి, హర్షవర్ధన్, లక్ష్మీదేవి, వరలక్ష్మి,కీర్తి,రాజేశ్వరి, మాధవి హాజరయ్యారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రాంకీ,రంజిత్,చంద్రబాబు, రామేశ్వరి,సునీల్,శ్రీనాథ్, వినయ్, జగదీష్, ప్రత్యూష,జయసింహా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రథసప్తమి



సూర్యభగవానుడిని పూజిస్తున్న అర్చకులు.

**పామిడి, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీ నగరేశ్వరస్వామి, శ్రీ అనంత గజ గరుడ లక్ష్మినారాయణ స్వామి దేవాలయాల్లో మంగళవారం రథసప్తమి (సూర్యభగవానుడు జయంతి)ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పామిడికి చెందిన రిటైర్డ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రౌతుల వరదప్ప శ్రీ నగరేశ్వరస్వామి దేవాయాలనికి అందించిన సూర్యభగవానుడిని ప్రత్యేకంగా అలంరించిన అర్చకులు నాగరాజరావుస్వామి అభిషేక అర్చనలు చేపట్టి పూజలు చేపట్టారు. శ్రీ అనంత గజ గరుడ లక్ష్మినారాయణస్వామి దేవాలయం నందు స్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు చేయగా భక్తాదులు విష్ణు సహస్ర నామ పారాయణం గావించారు. అనంతరం శ్రీ అనంత గజ గరుడ లక్ష్మినారాయణ స్వామి శ్రీదేవి భూదేవిని అలంకరించి గోవింద నామ స్మరణల మధ్య ప్రాకారోత్సవం జరిపారు. శ్రీ నగరేశ్వరస్వామి దేవాలయంలో సూర్య భగవానుడును దర్శించుకున్న విగ్రహదాత రిటైర్డ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రైతుల వరదప్ప కుమారుడు రౌతుల నాగరాజు పూజలు చేపట్టి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాఘశుద్ద సప్తమిని రథసప్తమి అంటారని సూర్యుడు ఏకచక్ర రథము ఆరు ఆకులు ఏడు అశ్వాలతో కూడిన వాహనంపై ప్రయానిస్తాడని తెలియజేస్తూ చక్రం అంటే ఒక సంవత్సరం ఆరు ఆకులు అంటే ఏడు కిరణాలు అని వివరించారు. దేవాలయాల్లో సూర్య భగవానుడిని దర్శించుకుంటూ పూజలు చేపట్టడటంతో ఆయాదేవాలయాలు కిటకిటలాడాయి.

## క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**నార్పల,ఫిబ్రవరి 04 ప్రభాతవార్త**

నార్పల మండలం శిద్దరాచెర్ల గ్రామంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సాకే రామాంజ నేయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,క్యాన్సర్ నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం అని తెలిపారు.ముఖ్యంగా మహిళల్లో నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్,గర్భాశయ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తున్నాయనీ, ప్రాథమిక దశలో గుర్తిస్తే వీటి చికిత్స సులభమవు తుందనీ వివరించారు. అలాగే,పురుషుల్లో పాన్, గుట్కా,ధూమపానం వంటి మోతాదుకు మించి అలవాట్లు నోటి క్యాన్సర్‌కి దారితీస్తాయని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య నిపుణులు క్యాన్సర్ లక్షణాలు, నివారణ మార్గాలు,చికిత్స విధానాలు గురించి సమగ్ర సమాచారం అందించారు. ప్రజలందరూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా,ఏ చిన్న లక్షణం కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఈ అవగాహన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సాకే కుల్లాయప్ప, ఎంఎల్‌హెచ్పీ అమృతాంజలి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు శివయ్య, యామిని,అంగన్వాడి టీచర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.


## SALE PROCLAMATION-CUM-E-Auction

**GOVERNMENT OF INDIA, MINISTRY OF FINANCE,**
**DEPARTMENT OF FINANCIAL SERVICES, DEBTS RECOVERY TRIBUNAL-2-AT HYDERABAD,**
**1St Floor, Triveni Complex, Abids, HYDERABAD-500001, Ph:040-24756467.**

**RP No.12 of 2024** **Date: 30.01.2025**

**PROCLAMATION OF SALE UNDER RULES 38,52(2) OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961 READ WITH THE RECOVERY OF DEBTS DUE TO BANKS AND FINANCIAL INSTITUTIONS ACT, 1993**

**(CH1) Union Bank of India (Formely Corporation Bank)**
**Branch Office At 4/659, Chintalarayungudi Veedhi, Tadipatri, Anantapur, Andhra Pradesh -515411.**

**Certificate Holder**

**(CD1) Malapti Bhaskar Naaidu,** S/0 Kondappa, R/o H.No.15/229, Kamala Nagar, Ananthapur, Andhra Pradesh-515001.
**(CD2) Paathakumari Sujatha,** W/o P. Nagaraju, R/o 11-512, Aravinda Nagar, Narpala Village, Near Shepherd School, Anantapur, Andhra Pradesh-515001.

**Certificate Debtors**

WHEREAS a Recovery Certificate bearing **RP No.12/2024** dated **10.01.2024** was issued by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal-II, Hyderabad, under Sec.19(22) of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993.
WHEREAS The undersigned initiated recovery proceedings in **RP No.12/2024** for recovery of **Rs.54,73,519/- (Rupees Fifty Four Lakhs Seventy Three Thousand Five Hundred Nineteen Only.)** with interest, costs, etc specified in the Recovery Certificate aforesaid and the Second and Third Schedules to the Income tax Act, 1961, from the Certificate Debtors.
And whereas the undersigned has ordered the sale of the mortgaged/attached property mentioned in the schedule annexed hereto in satisfaction of Recovery Certificate.
and Whereas on the **20.03.2025** (the date fixed for sale), there will be due there under a sum of **Rs.54,73,519/- (Rupees Fifty Four Lakhs Seventy Three Thousand Five Hundred Nineteen Only.)** (Decree Amount) plus interest and cost payable as per Recovery Certificate issued by Hon'ble Presiding Officer, DRT (less amount already recovered, if any) **from Malapti Bhaskar Naaidu & Another.**
NOTICE is hereby given that in the absence of any order of postponement, the said property shall be sold on **20.03.2025** by e-auction and the bidding shall take place through **"Online Electronic Bidding"** through the website **www.baanknet.com** by the Service Provider **"PSB ALLIANCE BAANKNET" & Contact No:+91 8291220220, Mail id: support.baanknet@psballiance.com.**
For more details contact **Mr. Siva Kumar Chief manager, Union Bank of India, Tadipatri Branch, Mobile No.8332879099**, Mail id:**ubin0805521@unionbankofindia.bank** for query, inspection of Schedule Property perusal of copies of the title deeds and latest Encumbrance Certificate to exercise due diligence and satisfy themselves about title of the property under Auction Sale.

### TERMS AND CONDITIONS

**1.** The sale will be of the immovable property as mentioned in the schedule.
2. The reserve price below which the properties shall not be sold is **Lot No.1. Rs.7,00,000/- Lot No.2 Rs.36,00,000/-**
3. The properties will be put for auction on **20.03.2025** as per details annexure.
4. No Officer or other person, having any duty to perform in connection with this sale shall however, either directly or indirectly bid for, acquire or attempt to acquire any interest in the property sold. The sale shall be subject to the conditions prescribed in the Second Schedule to the Income Tax Act, 1961, and the income tax certificate proceedings Rules 1962, the rules made there under.
5. Bidders are advised to go through the website **www.baanknet.com** for detailed terms and conditions of auction sale, procudure and application form etc.. before submitting their Bids for taking part in the e-auction sale proceedings.
6. The particulars specified in the annexed schedule have been stated to the best of the information of the undersigned but the undersigned shall not be answerable for any error, mis-statement or omission in the proclamation.
7. The highest bidder shall be declared to be the purchaser of the property provided always that he is legally qualified to bid and provided further that the amount bid by him is not less than the reserve price. It shall be in the discretion of the undersigned to decline acceptance of the highest bid when the price offered appears so clearly inadequate so as to make it inadvisable to do so.
8. The EMD to the extent of **10% reserve price** shall be deposited by the bidder by **17.03.2025** either by **RTGS/NEFT/Funds** Transfer to credit of **Account No.311221980050000 Name of the Account: Inward RTGS Account and IFSC Code:UBIN0931128 or by Demand Draft/Pay Order in favour of "Registrar", DRT-2, Hyderabad".**
**9.** The successful bidder shall have to pay **25%** of the purchase consideration after adjustment of **10% EMD** on being knocked down by next day i.e by **3.00 PM** in the said account as per details mentioned in Para 8 above. If the next day is Holiday or Sunday, then on next working day. **Balance 75% of the purchase consideration is to be remitted within 15 days from the date of auction.**
**10.** In addition to the above, the purchaser shall also deposit poundage fee with **Registrar, DRT-2, Hyderabad @ 2% up to Rs.1000/- and @ 1% of the excess of the said amount of Rs.1000/- through DD in favour of "Registrar DRT-2, Hyderabad".**
**11**. In case of default of payment within the prescribed period, the deposit, after defraying the expenses of the sale, may, if the undersigned thinks fit, shall be forfeited to the Government and the defaulting purchaser shall forfeit all claims to the property or to any part of the sum for which it may subsequently be sold. The property shall be resold, after the issue of fresh proclamation of sale.
**12.** Purchaser bidding for the property shall ensure to abide by the prevailing applicable laws. The property is being sold on. "As is where is" and "As is what is" condition. The bidders should make their own enquiries regarding ownership, encumbrances, charges or statutory dues such as taxes etc., with respect to the property. It shall be deemed that the bidders have done their own due diligence before submitting the bids.
**13**. The property is being sold on **"As is where is & As is what is basis"**
**14. The undersigned reserves the right to accept or reject any or all bids if found unreasonable or postpone the auction at any time without assigning any reason.**

**Specification of property**

**Description of Lot-1 property**

Anantapurmu RD, SRD of Singanamala, Chamaluru Village with in Chamaluru Panchayat Limits, Sy.No.205/1C, A.C.1.18 H.S.0.475 bounded by: East: Cherish Creations, South: Land belongs to N. Rajendra, West: Land belongs to M. Hymavathi, North: Land belongs to P. Nagaraju.

**Description of Lot-2 Property**

Änantapuramu RD, SRD of Anantapuramu, Anantapuramu Village, Within Anantapuramu Municipal Corporation Limits. S.No.266, A.C.4.68 out of this A.C.3.48, out of this A.C.0.06.5, Plot No.101 out of this A.C.0.02,H.S.0.008 **and bounded by:**
East:S.No.267, South:Plot belonging to late Imam Sab, West: 80 feet Road, North: House bearing D.No.12-674/A.A

**DETAILS OF AUCTION**

| Lot No | DATE OF AUCTION | LAST DATE OF BID SUBMISSION | TIME OF AUCTION | RESERVE PRICE | 10% EMD AMOUNT | BID INCREMENT AMOUNT |
|---|---|---|---|---|---|---|
| Lot No.1 | 20.03.2025 | 17.03.2025 | 11:00 AM TO 11:30AM PM | Rs.7,00,000/- | Rs.70,000/- | Rs.25,000/- |
| Lot No.2 | 20.03.2025 | 17.03.2025 | 11:30 AM TO 12:00 NOON | Rs.36,00,000/- | Rs.3,60,000/- | Rs.50,000/- |

**Given under my hand & seal of this Tribunal at on this 30th day of January, 2025**

**(PRASANT KANKRANIA)**
**RECOVERY OFFICER,**
**DEBT RECOVERY TRIBUNAL-2,**
**HYDERABAD-500001.**

04ATP13_04ATP13.qxd 04-02-2025 PM 10:44 Page 1



# అనంత హార్టికల్చర్ కాంక్లేవ్" కార్యక్రమం కోసం పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలి..

**అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి.**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్.**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

**అనంతపురం రూరల్,ఫిబ్రవరి 04 ప్రభాతవార్త :** ఈనెల 5వ తేదీన జాతీయస్థాయిలో నిర్వహించే "అనంత హార్టికల్చర్ కాంక్లేవ్" కార్యక్రమం కోసం పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్‌లో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షనల్ హాల్ లో ఈనెల 5వ తేదీన నిర్వహించే "అనంత హార్టికల్చర్ కాంక్లేవ్" కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని బళ్లారి రోడ్ లో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షనల్ హాల్ లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి అందరూ సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పిపిటిని ఫైనలైజ్ చేయాలని, స్టాల్ ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలన్నారు. స్టేజిపై పుష్పాలంకరణ ఆకర్షనీయంగా చేపట్టాలన్నారు. అవసరమైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, రిజిస్ట్రేషన్ డెస్క్ ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఆర్డీఓ కేశవనాయుడు, అడిషినల్ ఎస్పి రమణమూర్తి, డిఎస్పి వెంకటేశ్వర్లు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్



కార్యక్రమం ఏర్పాటు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్.

మల్లికార్జున, జడ్పి సిఈఓ ఆర్.రామచంద్ర రెడ్డి, సిపిఓ అశోక్ కుమార్, డ్వామా పిడి సలీమ్ భాష, డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిపిఓ నాగరాజు నాయుడు, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎన్ఐసి డిఐఓ రవిశంకర్, డీఎస్డిఓ ప్రతాపరెడ్డి, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, మార్కెటింగ్ ఏడి సత్యనారాయణ చౌదరి, హార్టికల్చర్,వ్యవసాయశాఖ ఏడి ఏ ఎడిఏ లు ఫిరోజ్ ఖాన్, రవి, తాసిల్దార్ మోహన్ కుమార్, హార్టికల్చర్ అధికారి పల్లవి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురండి - జిల్లా ఎస్పి వి.రత్న





డీ మొబలైజేషన్‌లో పరేడ్‌ను ఉద్దేశించిమాట్లాడుతున్న జిల్లా ఎస్పి , బహుమతులు ప్రదానంచేస్తున్న జిల్లా ఎస్పి వి.రత్న

**పుట్టపర్తి, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త**

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వుడు అంటే శ్రీ సత్యసాయి జిల్లా అని చెప్పుకునే విధంగా విధులు నిర్వర్తించి శ్రీ సత్య సాయి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా ఎస్పీ వి.రత్న పిలుపునిచ్చారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించిన " మొబలైజేషన్ "కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వి.రత్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్. ఆర్ఐ మహమ్మద్ వలిలు జిల్లా ఎస్పికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పి పరిశీలన వాహనంపై వెళ్లి ఏ.ఆర్ ప్లటూన్లను పరిశీలించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షించడంలో జిల్లా పోలీసులకు మంచి పేరుందని, జిల్లా వ్యాప్తంగా జరిగిన సంఘటనలలో సాంఘిక, రాజకీయ, మతపరమైన, అధికార కార్యక్రమాలలో ,ఏ ఆర్ శాఖ అత్యంత క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీసు విభాగానికి ఎంతో పేరు తీసుకువచ్చారన్నారు. జిల్లాలో జరిగిన వినాయక నిమజ్జనం, గొడవలు రాజకీయ సంఘటనలు ఆందోళనలు ప్రదర్శనలలో అత్యంత కీలకమైన భద్రతా విధులు నిర్వహించారన్నారు. హిందూపురం, తాడిమర్రి ,ఇస్తిమా సందర్భంగా భద్రతా చర్యలు చేపట్టడమే కాక, శ్రీ సత్య సాయి బాబా 99 వ జయంతి ఉత్సవాలు పాల్గొన్న రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర డిజిపి విఐపి భద్రత ఏర్పాటు చేయడంతో పాటు స్వతంత్ర దినోత్సవం పోలీస్‌స్మారకదినోత్సవం గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రమశిక్షణతో కవాతు పరేడ్ నిర్వహించారన్నారు. ఏ.ఆర్‌సిబ్బందికి ప్రతీఏటా మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్ నెస్ ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉద్యోగంలోచేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. ఏ.ఆర్ పోలీసుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనని, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అందులో భాగంగానే వైద్య శిబిరం నిర్వహించడంతోపాటు యోగా, ధ్యానం గురించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. వృత్తి నైపుణ్యాల పెంపునకు, క్రమశిక్షణ పై నిపుణులచే మొబలైజేషన్ లో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. బి.డి టీం, ప్రిజనర్స్ ఎస్కార్ట్, పి.ఎస్ .ఒ లు, డ్రైవర్స్ , తదితర సిబ్బంది విధులు ఈకోవకు చెందినవే అన్నారు. ఫైరింగ్, డ్రిల్, కవాతు, మాబ్‌కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు, తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలానిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. ప్రజా దర్బార్ నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగాచూస్తామన్నారు. సిబ్బందిసంక్షేమంలో భాగంగా పలుచర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. యాన్యువల్ మొబలైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ఏ.ఆర్ డిఎస్పి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బందికి ఎస్పి కృతజ్ఞతలు తెలియజేశారు డీ మొబిలైజేషన్ పెరేడ్ ను క్రమశిక్షణతో అద్భుతంగా చేసిన పెరేడ్ కమాండర్ లను ఎస్.పి గారు అభినందించారు. మొబిలైజేషన్ ప్రక్రియలో కీలకంగా విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి, మొబిలైజేషన్ లో ఫైరింగ్, టర్న్ అవుట్ అండ్ ప్రొఫిషియెన్సీ పే టెస్ట్, డ్రైవింగ్ లో ప్రతిభ కనబరచిన వారికి ఎస్పీ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, ఆర్.ఐ లు మహమ్మద్ వలి, మహేష్ , ఆర్.ఎస్.ఐ. లు, వీరన్న ప్రదీప్ ,సింగ్ ప్రసాద్ ఏ.ఆర్.సిబ్బంది పాల్గొన్నారు. ఫైరింగ్ ప్రాక్టీస్‌లో శ్రీధర్, నారాయణస్వామి, ఏవీ రెడ్డి వీరాంజనేయులు, షక్షావలి ,చాంద్ బాషా, భాస్కర్, గోవిందులకు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఆర్ సిబ్బందికి బడా ఖాన నిర్వహించి , జిల్లా ఎస్పీ స్వయంగా తన చేతుల మీదుగా భోజనాలు వడ్డించారు

# మంత్రి నారాలోకేష్ దృష్టికి ధర్మవరం సమస్యలు

**- విజయవాడలో మంత్రి లోకేష్‌ను కలిసిన పరిటాల శ్రీరామ్**

**- చేనేతలు, హాకీ గ్రౌండ్, ఎంజేపి పాఠశాల సమస్యల్ని వివరించిన శ్రీరామ్**

**- శిల్క్ రాయితీ పథకం అమలుకు శ్రీరామ్ విజ్ఞప్తి**



మంత్రి నారాలోకేష్‌తో ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

**అనంతపురం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త బ్యూరో**

ధర్మవరంలో చేనేతలు, విద్యార్థులు, హాకీ క్రీడాకారులు సమస్యల్ని తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ ఐటి, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడలోని మంత్రి నివాసంలో మంగళవారం లోకేష్‌ను శ్రీరామ్ కలిశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రజాసమస్యలు, ఇతర వాటి గురించి చర్చించారు. మంత్రి లోకేష్‌కి పలు అంశాలపై శ్రీరామ్ వినతిపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా శిల్క్ రాయితీఅంశాన్ని ప్రస్తావించారు. చేనేత పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం నుంచి నేషనల్ హ్యాండ్ లూమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఎన్‌హెచ్‌డిసి) ద్వారా శిల్క్‌పై రాయితీ అందేదన్నారు. దీని వలన ధర్మవరంలో ప్రతి చేనేత కార్మికునికి ఉపయోగపడేదన్నారు. ఈ పథకం వర్తిస్తే చేనేతతో అనుబంధంగా ఉన్న డైయింగ్, శిల్క్ మర్చంట్స్, రీలర్స్, ట్విస్‌టర్స్, వైండింగ్ మొదలైన అన్ని విభాగాలకు ఉపాధి లభిస్తుందన్నారు. వేలాది మంది చేనేతలకు ఉపయోగపడే ఈ పథకాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమలు పరిచేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ధర్మవరం సమీపంలోని రేగాటిపల్లిలో ఉండాల్సిన మహాత్మా జ్యోతిబాపూలే బిసి బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ప్రస్తుతంబత్తలపల్లిలో నిర్వహిస్తున్నారని ఇక్కడ అందుకు తగిన విధంగా మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఎస్సీ, బిసి విద్యార్థులు సుమారు 360 మంది ఉన్నారని, అందుకు తగినవిధంగా బత్తలపల్లిలో సౌకర్యాలులేవన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు విద్యకు సంబంధించిన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పరిటాల శ్రీరామ్ చెప్పిన అన్ని అంశాల మీద మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**- దిశా నిర్దేశం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర 2047, జీరో పావర్టీ, జనాభా నిర్వహణ సంబంధించిన ప్రణాళికపై సంబంధిత అధికారులతో ఈ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిశా నిర్ధేశం చేశారు.

# రథసప్తమి వేడుకల్లో ప్రభుత్వ విప్ కాలవ



స్వామివారి రథోత్సవాన్ని లాగుడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

**రాయదుర్గం, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:** పట్టణంలో ఉన్న పలు దేవాలయాల్లో మంగళవారం రథ సప్తమి సందర్భంగా ఆలయ అర్చకులు దేవాలయాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రథోత్సవాలను లాగారు. ఈ వేడుకల్లో బాగంగా పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి దేవాలయం, జంబుకేశ్వరస్వామి దేవాలయం, నీలకంటేశ్వర దేవాలయం, హటకేశ్వరదేవాలయం తదితర ఆలయాల్లో ఉన్న మూలవిరాట్‌లకు ఉదయం నుండి గంగపూజ, పంచామృతాబిషేకం, కుంకుమార్చన, పుష్ప,నైవేద్యం, తదితర ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి పల్లకి సేవను ఆలయం నుండి కోట ముఖద్వారంమీదుగా తేరుబజార్,వినాయకసర్కిల్‌వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో ప్రభుత్వవిప్, స్థానికఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్వామివారి పల్లకిసేవలోపాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సుబ్రహ్మణ్య శష్టి వేడుకలు

**- పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత**



సుబ్రహ్మణ్యం స్వామి మొక్కులు తీర్చుకుంటున్న దృశ్యం

**రామగిరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని పేరూరులో పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో శష్టి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ శష్టి వేడుకల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది మాఘ శుద్ధ శష్టిరోజున ఈ వేడుకలను నిర్వహిస్తారు. శష్టి రోజున సమీప గ్రామ ప్రజలు ఉపవాస దీక్షతో ఉండి స్వామివారిని దర్శించుకుంటే సర్వరోగాలు నయమై ఆరోగ్యంగా ఉంటారని భక్తుల నమ్మకం. ఎమ్మెల్యే స్థానిక టిడిపి నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పీవీకేకే ఐటీలో "డిజిటల్ యుగంలో మల్టీమీడియా అనే అంశం పై అవగాహన కార్యక్రమం



**అనంతపురం, ఫిబ్రవరి 4, (ప్రభాతవార్త బ్యూరో)**

పీవీకేకే ఇంజినీరింగ్ కాలేజ్, అనంతపురంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం, కెరీర్‌గైడెన్స్ సెల్ సంయుక్తంగా "డిజిటల్ యుగంలో మల్టీమీడియా అవగాహన" అనేఅంశంపై ప్రత్యేకసెమినార్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి "మాక్ (లీతితిది తివితివిగితిశిగీళి) అనంతపురం" అనే సంస్థ ప్రతినిధి మరియు పీవీకేకే ఐటీ మాజీవిద్యార్థిని శ్రీమతిహర్షిణి ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో హర్షిణిమల్టీమీడియా ప్రాధాన్యత,డిజిటల్ టెక్నాలజీ పెరుగుతున్న విధానం, విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలు తదితర అంశాలపై వివరించారు. గ్రాఫిక్స్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ (VFX)వంటిరంగాల్లో ఉన్నఅవకాశాలను వివరించడంతో పాటు, విద్యార్థులు తమ భవిష్యత్‌ను మల్టీమీడియా రంగంలో ఎలా తీర్చిదిద్దుకోవచ్చో స్పష్టంగా తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.బండి రమేష్ బాబు, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ వహీదా, రాము, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు మల్టీమీడియా రంగంలోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో ఎంతో ఉపయోగపడుతుందని కళాశాల చైర్మన్ డా.పల్లె కిషోర్ తెలిపారు.

# హంద్రీనీవా కాలువ వెడల్పు చెయ్యాల్సిందే..!!

**మొదటిపేజి తరువాయి...** అవుతుందని గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సి. జాఫర్ మాట్లాడుతూ హంద్రీనివా ద్వారా సాగునీరు అందించి కరవు రైతాంగాన్ని ఆదుకోవాలని లైనింగ్ పనులు ఆపాలనే ప్రధాన డిమాండుతో రైతాంగ పోరాటం సిపిఐ చేస్తుందన్నారు. సత్య సాయి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం. వేమన్న యాదవ్ మాట్లాడుతూ హంద్రీనివా దీర్ఘ కాలిక సమస్యగా మారిందని గత 40 సవంత్సరాలుగా రాయలసీమ ప్రాంత రైతులు పోరాటం జరిగినా పరిష్కారానికి నోచుకోక పోవడం సిగ్గు చేటన్నారు. ధర్నా నుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, మానవ హక్కుల సంఘం నాయకులు బాషా, సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసి నాయకులు నాగరాజు మాట్లాడారు. ధర్నా అనంతరము హంద్రీనీవా డిప్యూటీ కలెక్టరుకు వినతిపత్రం నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ. కాటమయ్య ,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి. నారాయణస్వామి, సి. మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యులు జె. రాజారెడ్డి, బి. కేశవరెడ్డి. ఎన్. శ్రీరాములు,పి.రామకృష్ణ వీరభద్రస్వామి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు చెన్నప్ప యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నారాయణస్వామి, బి.రమణయ్య, సి.లింగమయ్య, అనంతపురం, గుంతకల్లు,గుత్తి, పుట్లూరు నార్పల మండల కార్యదర్శులు మేకల రమేష్,రాము రాయల్, రాందాస్,పెద్దయ్య, గంగాధర్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన పాట్నా హైకోర్టు మాజీ జడ్జి

**లేపాక్షి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి శ్రీదుర్గా పాపనాశేశ్వర, వీరభద్రస్వామి దేవాలయాన్ని మంగళవారం పాట్నా మాజీ హైకోర్టు జడ్జి వికాస్‌జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జికి ఆలయ చరిత్రను వివరించారు. ఆలయంలోని శిల్పాలు, తైలవర్ణ చిత్రాలు, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అసంపూర్తి కళ్యాణమండపం, వేలాడే స్తంభం చరిత్రను వారు తెలుసుకున్నారు. అనంతరం దుర్గాదేవి, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందన్ వారికి జ్ఞాపిక అందచేసి సత్కరించారు. వారి వెంట తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, డిటి కుమారస్వామిరెడ్డి, ఎస్ఐ నరేంద్ర, తదితరులు వున్నారు.



జ్ఞాపిక అందచేస్తున్న ఆలయ చైర్మన్ రామానందన్

# మాల్యంలో ఘనంగా సుంకులమ్మదేవి రథోత్సవం

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ మెట్టు**



సుంకులమ్మ రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ మెట్టు

**కణేకల్లు, ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:** కణేకల్లు మండల పరిధిలోని మాల్యం గ్రామంలో మంగళవారం సుంకులమ్మదేవి రథోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం మడుగుతేరు, సాయంకాలం రథోత్సవం జరిగింది. అమ్మవారిని రథంలో ఉంచి గ్రామాల్లో ఊరేగించారు. మడుగుతేరు కార్యక్రమంలో రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి, వైయస్ఆర్‌సిపి మండల కన్వీనర్ పాలిట్ బ్రహ్మానందరెడ్డి, మాజీఎంపిపి ఆలేరు రాజుగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, యర్రగుంట మాజీ సర్పంచ్ కేశవరెడ్డి, స్థానిక నాయకులు మర్రేగౌడ, ఇమాంవలీ, కంబరి చంద్ర, గిరి, బాషా, జయరామిరెడ్డి, ఆర్కేబద్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి మత్స్యసందప యోజనపై విస్తృత అవగాహన కల్పించండి - జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**పుట్టపర్తి (కలెక్టరేట్), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన అమలపై విస్తృతంగా మత్స్యకారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబందిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన స్కీం అంశంపై డీఎల్సీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిబిఆర్ రిజర్వాయర్లో చేపల పిల్లల పెంపక కేంద్రాన్ని కి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. డి ఎల్ సి కమిటీ సభ్యులలో ఇద్దరు ఖచ్చితంగా మత్స్యకారులు సభ్యులుగా ఉండాలని తెలిపారు. ఇరిగేషన్ ట్యాంకులలో ఎక్కడెక్కడ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద వచ్చి సంపద వృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు మత్స సంపద వృద్ధితో ప్రజలకు పోషకాహారంతో పాటు ఎన్నో కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు చేపల పెంపకానికి మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, ఇతరులకు 30 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, డిఆర్డిఏ పిడి నర్సయ్య, ఎల్ డి ఎం రమణ కుమార్, జెడి అగ్రికల్చర్ సుబ్బారావు, పశుసంవర్ధక శాఖ అధికారి, ఇరిగేషన్ అధికారులు, పాల్గొన్నారు.

# అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవు

**- జిల్లా సంయుక్త కలెక్టరు అభిషేక్ కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంయుక్త కలెక్టర్‌టి.ఎస్.చేతన్

**పుట్టపర్తి (కల్చరల్), ఫిబ్రవరి 4 , ప్రభాతవార్త**

లబ్దిదారులు దీపం2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుండి రూ.150వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్ లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చుచున్నాయి లబ్దిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు రుజువు అయ్యిన యెడల సదరుగ్యాస్ ఏజెన్సీలపై తగుచర్యలు తీసుకోనబడునని మరియు అట్టి ఏజన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చెయ్యడము జరుగుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని కోర్ట్ హాల్ ఛాంబర్ నందు పుట్టపర్తి మండల పరిధిలోని గ్యాస్ ఏజెంట్స్ ప్రతినిధులతో దీపంపథకం-2 సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులు అయిన పేద కుటుంబముల వారికి సంవత్సరానికి మూడు (3) గ్యాస్ సిలిండర్ లు ఉచితంగా పంపిణీ చెయ్యడం జరుగుతున్నది. సదరు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో శ్రీ సత్య సాయి జిల్లాలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న సిలిండర్లకు తాము చెల్లించిన నగదు మూడు రోజుల్లోపు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని లబ్దిదారులు తెలియజేస్తున్నారన్నారు. కావున ఈ పథకం కింద ఏ ఒక్కరూ ఎటువంటి అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆ విధముగా కాకుండా లబ్దిదారుల నుండి గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేసినచో కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08555289039కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చున్నారు. మరియు ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయము నందు జరుగు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ద్వార కూడా ఫిర్యాదు చెయ్యవచ్చుని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

# ఇరిగేషన్ స్థలాల కబ్జాపై ఆకస్మిక తనిఖీలు

**- మూడు ప్రాంతాలను గుర్తించిన డిఇ..ఆక్రమణలు తొలగింపుకు తహశీల్దార్‌కు సిఫారస్**



ఆక్రమణలను పరిశీలిస్తున్న డిఇ

**గోరంట్ల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

గోరంట్ల మండలంలోని ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయన్న ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ డిఇ లక్ష్మినారాయణ మంగళవారం మండలంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల సమీపంలోని రావికుంట చెరువు నుండి నీటి సరఫరా అయ్యే కాలువను పూడ్చేసి సింగిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో కొందరు లేఅవుట్ వేస్తున్న సమాచారంతో ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలిస్తూ ఆక్రమణలను గుర్తించారు. అనంతరం మల్లాపల్లి గ్రామంలోని ప్రధాన రోడ్డుకు ఆనుకుని వున్న గట్టు కాలువపై కొందరు వ్యక్తులు ఆ కాలువపైనే పిల్లర్లు వేస్తూ ఆక్రమించుకోవడాన్ని గుర్తించినట్లు తెలిపారు. అలాగే గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని మల్లాపల్లి జగనన్న లేఅవుట్ వెనుక ప్రాంతంలో వున్న ఎర్రచెరువుకు ఆనుకుని ఇరిగేషన్‌శాఖకు సంబంధించిన భూమిని కబ్జా చేస్తూ ప్లాట్లు వేసుకుని అమ్ముకోవడానికి ప్రహారీగోడ నిర్మించడాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ మూడు సంఘటనలపై ఆక్రమణలు తొలగింపుకు స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామని వారి సహాయంతో వాటిని తొలగిస్తామని ఇరిగేషన్ డిఇ లక్ష్మినారాయణ తెలిపారు. చెరువులు గాని నీరు పారే కాలువులను గాని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.